22

# శ్రీశేషుదేవులకు సేవ చేసిన

# శ్రీగాయత్రిమాత

శ్రీ శేషుబాబుగారు ఎల్లప్పుడూ తనలోని ఆధ్యాత్మికతను రహస్యముగానే ఉంచుకుని పైకి సామాన్యమానవునిలాగే కనిపించుటకు ప్రయత్నించేవారు. 1972లో సమస్తమును వదిలేసి అరణ్యమునకు వెళ్ళిపోవాలని ఆయనలో కలిగే వైరాగ్యయోచనలకు భగవంతుని అనుమతి లేదని గ్రహించినారు. ఆ యోచనకు భగవంతుని యొక్క అనుమతి ఉండియుంటే తాను అన్నీ వదలి విశాఖపట్నము వెళ్ళినపుడు భగవంతుడు తనను ఆ ప్రక్కనేయున్న దండకారణ్యమునకే నడిపించియుండేవారని, కానీ భగవంతుని చిత్తము తాను ఇప్పుడున్న పరిస్థితులలోను, బాధ్యతలలోను ఉండియే సత్యమును ఆరాధించాలనియే ఉన్నదని, కావుననే తనను మరల ఇక్కడికే తీసుకువచ్చి ఇంట్లోనే ఉంచినారని గ్రహించినారు. తనలో ఎంతటి వైరాగ్యాగ్ని రగులుచున్నను గానీ పరమతండ్రి చిత్త ప్రకారమే ఆయన తన బాహ్య బాధ్యతలనన్నిటినీ సక్రమముగా నిర్వర్తిస్తూ అందరిలో ఒకనిలాగ సామాన్యమానవునిలాగనే కనిపిస్తూ ఉండేవారే గానీ ఆధ్యాత్మిక తత్వవేత్తగ ఎప్పుడూ గుర్తింపబడేవారు కాదు. 1972లో సద్గురులీల వలన ఆయన తన ఉత్తీర్ణతను శిష్యునికి దానమిచ్చుట చేత ఆయన ఇంటర్మీడియెట్ పరీక్షలో ఉత్తీర్ణులు కాలేదు. తనకు బాహ్యచదువు మీద మనసు లగ్నం కాకపోయినప్పటికీ బాధ్యతను వీడలేదు. ఆయన తండ్రిగారగు శ్రీ భైరవస్వామి గారి యెడల గల గౌరవము తోను, నీతిమంతుడైన తండ్రిని బాధపెట్టరాదనే ఉద్దేశ్యముతోను చదువును మరల కొనసాగించినారు. 1973లో ఇంటరు పరీక్షను ప్రైవేటుగాకట్టి ఉత్తీర్ణులైనారు. 1973 లోనే తండ్రిగారి కోరికమేరకు రాజమండ్రి లోని రామదాసు కో-ఆపరేటివ్ ట్రైనింగు ఇన్స్టిట్యూట్ నందు కో-ఆపరేటివ్ శక్రటరీ ట్రైనింగు సంవత్సరము కొర్సు చదివి ఉత్తీర్ణులైనారు. ట్రైనింగు సమయంలో రాజమండ్రిలో గది అద్దెకు తీసుకుని ఉండేవారు. ప్రతి శనివారము సాయంత్రం రామచంద్రపురము వచ్చేసి మరల సోమవారము ఉదయము రాజమండ్రి వెళ్ళేవారు. ఆయన బాహ్యచదువు కర్మలో నిమగ్నమైనను గానీ మనస్సంతా సత్యచింతనతోనే నిండిపోయియుండేది. సాయంత్రం కాలేజీ అవగానే ఒంటరిగా రాజమండ్రి బ్రిడ్జి మీద నడచుకుంటూ చాలా దూరం వెళ్ళిపోయి ఎవ్వరూ లేనిచోట ఏకాంతముగా కూర్చొని సత్యచింతనలో, ఆత్మవిమర్శలో, వైరాగ్య యోచనలతో, దైవీప్రేమ విరహాగ్నిలో గంటల తరబడి కూర్చుని ఉండిపోయేవారు. రాత్రి చాలా ఆలస్యముగా రూమ్‌కి చేరుకునేవారు. ఆ కాలములో ఆయన నిద్రపోయినది చాల తక్కువ. రాత్రిళ్ళు కూడా పడుకునియుండి కూడా నిద్రపోకుండా సత్యచింతనలో మునిగిపోయేవారు. నిద్రాహారములను నిర్లక్ష్యము చేయుట వలన దేహము పూర్తిగా

continue..

బక్కచిక్కిపోతున్నను గానీ ఆ ఆలోచనే ఆయనకు ఉండేది కాదు. రాత్రింబవళ్ళు దైవచింతనలోనే ఉన్నను ఆ సంగతి బయటకు తెలియకుండా జాగ్రత్తపడే వారు. చదువు వంటి బాహ్య వ్యవహారాలలో మామూలుగా ఉన్నట్లుగా కనిపించచేసేవారు.

ప్రతి శనివారము, ఆదివారము రామచంద్రపురము వచ్చి స్నేహితులతో సత్యబోధలో నిమగ్నమయ్యేవారు. 1972 వరకు స్నేహితులందరితో కలసి మిమిక్రీ వంటి వినోద కార్యక్రమములు చేసే ఆయన 1972 నుండి అవియన్నీ వదిలేసినారు. పార్కుకు వెళ్ళడము గానీ అక్కడున్న పాత మిత్రులందరినీ కలవడముగానీ, సినీ నటీనటుల వాదనలలో పాల్గొనడంగానీ అన్నీ మానివేసినారు. ఆయన మనస్సు సత్యమును తప్ప మరే బాహ్యవిషయాన్నీ ఇష్టపడేదికాదు. తండ్రిని బాధ పెట్టకుండుట కొడుకుగా తన బాధ్యత కాబట్టి చదువును మాత్రము వదలలేదు. అప్పటికి స్నేహితులలో కొంతమంది ఆయన చెప్పే సత్యబోధను ఆసక్తితో వినేవారు ఏర్పడినారు. ఆ స్నేహితులతో తప్ప మిగిలిన వారితో కలిసేవారు కాదు. ఆ స్నేహితులను తీసుకుని పార్కుకు కాకుండా రామచంద్రపురములోని మున్సిపల్ గ్రౌండుకు వెళ్ళి అక్కడ సత్యవిషయాలనే మాట్లాడేవారు.

ఎవ్వరైతే బాహ్యమునంతా విసర్జించి సత్యమునే నమ్ముతారో, ఎవ్వరైతే తమ స్వశక్తిమీద కాకుండా భగవంతుడిపైనే ఆధారపడతారో, ఎవ్వరైతే రెండు చేతులలోని ఇహాన్ని వదిలేసి రెండు చేతులూ జోడించి భగవంతుడినే శరణాగతి చెందుతారో అట్టి వారిని రక్షించుటకు, సేవ చేయుటకు విశ్వవ్యాప్తమైన నిరాకార పరమాత్మ యొక్క మాతృగుణమునకు సాకార రూపమగు జగన్మాత శ్రీ గాయత్రీ మాత ఎప్పుడూ సిద్ధముగా ఉంటారు.

## శ్రీ గాయత్రి మంత్రము

**"ఓం భూర్భువస్వః తత్సవితుర్వరేణ్యమ్
భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్"**

శ్రీ గాయత్రిమాత యొక్క అక్షర స్వరూపమే శ్రీ గాయత్రీ మంత్రము అయియున్నది. భగవంతుడు ప్రేమాస్వరూపుడు. సమస్త జీవులను భగవంతుడు ఎల్లప్పుడూ ప్రేమిస్తూనే ఉంటారు. అనుక్షణము రక్షిస్తూ, సేవ చేస్తూనే ఉంటారు. ఎవరైతే పూర్తిగా భగవంతుడినే శరణాగతి చెందుతారో వారి సమస్త బాధ్యతలు భగవంతుడే స్వీకరించి వారి భారాన్ని పూర్తిగా భగవంతుడే మోస్తారు. "మనిషికి భగవంతుడు అప్పగించిన సత్యబాధ్యత అనే పడవను నడుపుటకు బాధ్యత వహించి పది పాళ్ళు కష్టపడి నడిపితే చాలు. ఆ మనిషి యొక్క బాహ్య జీవితమనే పడవను భగవంతుడే పూర్తిగా నడిపిస్తారు. ఆ మనిషి వంద పాళ్ళు కష్టపడినా నడుపుకోలేనంత బాగుగా అద్భుతముగా భగవంతుడు అతని జీవిత పడవను నడిపిస్తారు". అని శ్రీ శేషబాబుగారు చెప్పియున్నారు. అలాగే "మీరు దేవుని రాజ్యమును, నీతిని వెదకినచో దేవుడే మీ జీవితఅక్కరలన్నీ తీరుస్తారు."



continue..

అని శ్రీ యేసు క్రీస్తు చెప్పియున్నారు. కావున అట్టివారికి భగవంతునిలోని మాతృగుణ రూపిణియగు జగన్మాత శ్రీ గాయత్రిమాతయే ప్రతిక్షణము తోడుగా ఉండి సేవచేస్తారు. చంటిపిల్లవానిని తల్లి అనుక్షణము ఎత్తుకుని యుండి అతడు అడగకుండానే అతనికి అవసరమైనవన్నీ, అతడు ఇష్టపడేవన్నీ, అతనికి ఆనందాన్ని కలిగించేవన్నీ తానే తెలుసుకుని అన్నింటినీ అతనికి ఎంతో గారాభముతో ప్రేమతో సమకూర్చునట్లే శ్రీ గాయత్రిమాత కూడా తనను సాక్షాత్కరించుకొనిన వ్యక్తికి సేవ చేస్తారు. శ్రీ గాయత్రిమాతను సిద్ధించుకున్న వ్యక్తికి ఎదురయ్యే అన్ని పరిస్థితులలోను, అన్ని రూపాలలోను అమ్మయే ఉండి సేవ చేసేస్తుంటారు. ఆ వ్యక్తి తనకు కలుగుచున్న సేవలకు ఏ పరిస్థితులనుగానీ, ఏ వ్యక్తులనుగానీ కారణముగా ఏ మాత్రము భ్రమించరాదు. ప్రతి పరిస్థితిలోను, ప్రతి వ్యక్తిలోను ఉండి అమ్మయే సేవ చేయుచున్నారనే సత్యమును ప్రతిక్షణము గుర్తుంచుకుంటూ మాతృభావముతో, కృతజ్ఞతా భావముతో అమ్మసేవను స్వీకరించాలి. ఆ వ్యక్తి అమ్మసేవకు ఏ పరిస్థితినో, ఏ వ్యక్తినో కారణమని భ్రమించినాగానీ, తన శక్తి సామర్థ్యాలే కారణమని అహకరించినాగానీ, తన అర్హత వల్లనే అమ్మ సేవను పొందుచున్నానని తదాత్మ్యము చెందినాగానీ శ్రీ గాయత్రి మాత సేవకు దూరమైపోతాడు అమ్మసేవకు తానే అడ్డయిపోతాడు. ఎవరైతే అమ్మ సేవను అనుక్షణము మరచిపోకుండా, ఆటంకము కాకుండా శాశ్వతముగా నిలుపుకుంటారో వారే శ్రీ గాయత్రిసిద్ధిని పొందిన మహాత్ములు. అట్టి సిద్ధి పొందిన వారెవ్వరూ తాము అట్టి సిద్ధివల్లనే సేవను పొందుచున్నామని తెలుసుకుంటూ ఉంటారే గానీ ఎవ్వరికీ చెప్పుకోరు. అందరిచే గుర్తించబడితే తద్వారా అహంకారమునకో, తదాత్మ్యమునకో లోబడుటకు, అమ్మసేవను కోల్పోవుటకు అవకాశముంటుందని భావిస్తారు. భగవంతుడినే శరణాగతి పొంది దేవుని రాజ్యమును, నీతిని వెదుకుటలో సంపూర్ణముగా నిమగ్నమైపోయిన శ్రీ శేషుబాబుగారికి ప్రతిక్షణము శ్రీ గాయత్రిమాతయే తోడుగా ఉండి చంటిబిడ్డకు వోలే గారాభముగా సేవ చేసెడివారు.

శ్రీ శేషుబాబుగారిని పరమాత్మశక్తి శ్రీ గాయత్రిమాత రూపములో జీవితకాలమంతా ఎత్తుకునియుండి అవసరమైన వాటి నన్నింటిని అమ్మయే సమకూర్చేవారు. ఆయన జీవితకాలమంతటిలో శ్రీ గాయత్రిమాతయే ఆయనకు అన్ని సేవలు చేసియున్నారే గానీ ఏ వ్యక్తులూ ఆయనకెప్పుడూ ఎట్టి సేవను చేసియుండలేదు. ఏ వ్యక్తియైనా ఎప్పుడైనా ఆయనకు సేవ చేయుచున్నట్లుగా కనిపించినచో, అప్పుడు ఆ వ్యక్తికి దేవతాశక్తులతో శ్రీ శేషుబాబుగారే సేవ చేయుచున్నారని అర్థమైయున్నది. శ్రీ శేషుబాబు గారు జీవితకాలములో స్వీకరించిన సేవలన్నింటికీ అమ్మపైనే ఆధారపడియున్నారు. అమ్మనుండియే స్వీకరించినారు గానీ ఏనాడూ ఏ సేవకొరకూ ఏ వ్యక్తినీ ఆశించలేదు, ఏ వ్యక్తిపైనా ఆధారపడలేదు. అందువల్లనే ఆయన సత్యబోధలో ఎవ్వరిని విమర్శించుటకైనా ఏనాడూ వెనుకంజ వేయలేదు. మాయను సంపూర్ణముగా త్యజించిన శ్రీ గురుదేవులు అమ్మసేవను ఏనాడూ మాయాకారణాలకు అర్పించే అవకాశము లేదు. తనను తానెప్పుడూ గొప్పవానిగా అంగీకరించక ప్రతి సత్యవిమర్శను ముందుగా



continue..

తనకే అన్వయించుకుంటూ అందరికంటే తానే తక్కువవాడినని భావించుకునే ఆత్మవిమర్శ ప్రధానులైన శ్రీ గురుదేవులు అమ్మయెడల ఏనాడూ అహంకారానికిగానీ, తదాత్మ్యమునకుగానీ లోబడే అవకాశమే లేదు. కావుననే శ్రీ గాయత్రిమాత జీవిత కాలమంతా ఆయనకు తల్లిలా తోడుగాయుండి సేవ చేస్తూనేయున్నారు.

ప్రతి క్షణము, ప్రతి పరిస్థితిలోను శ్రీగాయత్రీమాతయే నిండియుండి చంటిబిడ్డకు తల్లివలె శ్రీ శేషబాబుగారికి సేవ చేయుచూ, రక్షిస్తూ ఉండేవారు. ఎవ్వరైతే శ్రీ గురుదేవులను గురువుగా, దైవముగా నమ్మి శరణాగతి చెందుతారో అట్టి వారికి అప్పుడూ, ఇప్పటికీ కూడా శ్రీ గురుదేవులలోని శ్రీగాయత్రిమాత శక్తియే అమ్మగా అనుక్షణము అండగా ఉండి సేవ చేయుచూ రక్షించుచుండుటను ప్రత్యక్షముగా అనుభవములో చూచుచున్నాము. ఇట్టి అనుభవమును ఇప్పటికీ, ఎప్పటికీ ఎవ్వరైనా పొందవచ్చునని పరమతండ్రి దయవలన శ్రీ శేషతండ్రి దయవలన ఖచ్చితముగా చెప్పుచున్నాను.

